
RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | మంగళవారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 254 | సెప్టెంబర్ 09, 2025 | వెల : రూ.3-00




కాశీబుగ్గలో క్షుద్రపూజల

## కలకలం..

2లో..





# రాధాకృష్ణన్ VS సుదర్శన్

- నేడే ఉపరాష్ట్రపతి ఎన్నిక
- ఎన్నికకు సర్వం సిద్ధం
- తొలి ఓటు వేయనున్న ప్రధాని నరేంద్ర మోడీ

**వేద న్యూస్, డెస్క్:**

జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామాతో ఖాళీ అయిన ఉప రాష్ట్రపతి స్థానాన్ని భర్తీ చేసేందుకు మంగళవారం (నేడు)జరిగే పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. ఈ ఎన్నికలో ఎన్డీఏ అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్, విపక్షాల ఉమ్మడి అభ్యర్థి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి పోటీ పడుతున్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ప్రధాని నరేంద్ర మోడీ ఓటింగ్‌ను ప్రారంభించనున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ ఎన్నికలో ప్రధాని తొలి ఓటు వేయనున్నట్లు తెలిపాయి. పార్లమెంట్ భవనంలో రహస్య ఓటింగ్ విధానంలో జరిగే పోలింగ్‌లో ఉభయ సభల సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

**- ఓట్ల లెక్కింపు సాయంత్రం 6 గంటలకు ప్రారంభం**

సాయంత్రం 6 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. ఆ తర్వాత ఫలితాలను ప్రకటించనున్నారు. రాజ్య సభ, లోక్‌సభ సభ్యులతో కూడుకున్న ఎలక్టోరల్ కాలేజీలో ఎంపీలు తమకు నచ్చిన వారికి ఓటు వేసే వెసులుబాటు ఉంటుంది. అయినప్పటికీ తమ పార్టీకే ప్రాధాన్యం ఇస్తారు. క్రాస్ ఓటింగ్ జరిగే అవకాశము కూడా ఉంటుంది. దీంతో అధికార ఎన్డీఏ పూర్తి మెజార్టీ ఉన్నప్పటికీ జాగ్రత్తగా వ్యవహరిస్తోంది.

**- అభ్యర్థుల బలాబలాలు**

ఎలక్టోరల్ కాలేజీ విషయానికి వస్తే, లోక్‌సభలో 542 మంది సభ్యులు, రాజ్యసభలో 239 మంది సభ్యులు కలిసి మొత్తం 781 మంది ఉన్నారు. ఇందులో ప్రతి సభ్యుడి ఓటు విలువ ఒకటిగానే ఉంటుంది. మెజార్టీ మార్కు 391 కాగా, అధికార ఎన్డీఏ కూటమికి ఇప్పటి వరకు 425 సభ్యుల బలముంది. 11 మంది సభ్యులున్న వైసీపీ పార్టీ ఎన్డీఏకు మద్దతు ఇవ్వాలని నిర్ణయించడంతో మెజార్టీ పెరిగింది. దీంతో ఎన్డీఏ కూటమి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ గెలుపు ఖాయంగానే కనిపిస్తోంది. అటు విపక్షాల ఇండియా కూటమికి 324 మంది బలముంది. కొన్ని పార్టీలు మద్దతు ఇచ్చినా విపక్ష అభ్యర్థి విజయానికి దూరంగానే కనిపిస్తుంది.

**- ఎన్నికకు బీఆర్ఎస్ దూరం**

ఈ ఎన్నికకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్టు బీఆర్ఎస్‌తో పాటు బిజు జనతాదళ్ (బీజేడీ) ప్రకటించాయి. దీంతో బీఆర్ఎస్ నలుగురు, బీజేడీ ఏడుగురు సభ్యులు ఓటింగ్‌లో పాల్గొనే అవకాశం లేదు. శిరోమణి అకాలీదళ్, జోరమ్ పీపుల్స్ మూమెంట్ - మిజోరం లాంటి పార్టీలకు ఒక్కో సభ్యుడు మాత్రమే ఉన్నారు. విపక్షాల అభ్యర్థికి మద్దతు ఇస్తున్నట్లు పది మంది ఎంపీలు ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ప్రకటి ంచినప్పటికీ, ఎంపీ స్వాతి మాలివాల్ కు ఆ పార్టీతో సంబంధాలు క్షీణించిన నేపథ్యంలో, ఆమె ఎవరికి ఓటు వేస్తారనే దానిపై స్పష్టత లేదు. స్వతంత్ర అభ్యర్థులు, ఇతర పార్టీ సభ్యులు ఎవరి వైపు మొగ్గు చూపుతారనే విషయంపై ఆసక్తి నెలకొంది.



## సమస్యల వలయంలో
# రత్నంపేట గ్రామం

- సమస్యలు పరిష్కరించాలని గ్రామ ప్రజల విజ్ఞప్తి.

**వేద న్యూస్,బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం రత్నంపేట గ్రామం అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతుంది. గ్రామంలో నెలకొన్న సిమెంట్ రోడ్ల డ్యామేజీ గాని, రోడ్డు కిరువైపులా గడ్డి తీయడంలో కానీ,రోడ్డు మధ్యలో వెళ్లే రహదారికి ఇరువైపులా ఎవరికి వారు ఇష్టానుసారంగా కట్టెలు,చెత్త చెదారం వేసిన అలాగే కంకర రాళ్లు, ఉన్న తీసివేయడంలో గ్రామపంచాయతీ కార్యదర్శి ఎలాంటి పనులు చేపట్టడం లేదు.మరి కొద్ది రోజుల్లో బతుకమ్మ, దసర, పండుగలు వస్తున్న నేపథ్యంలో గ్రామంలో నెలకొన్న సమస్యలపై దృష్టి పెట్టకపోవడం వల్ల గ్రామ ప్రజలు ఇబ్బంది పడుతున్నారు..ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, స్పందించి కార్యదర్శి, ని మార్చాలని అలాగే గ్రామాలలో నెలకొన్న సమస్యలపై దృష్టి పెట్టి సమస్యలు పరిష్కరించాలని గ్రామా ప్రజల పక్షాన పత్రిక ముఖంగా మండల సిపిఎం పార్టీ కన్వీనర్ గురజాల శ్రీధర్, విజ్ఞప్తి చేయడం జరుగుతుంది.

# సేవే ప్రవీణ్ మార్గం

- శ్రీ కృష్ణపిల్లల ఆస్పత్రిలో చక్కటి వైద్య సేవలు
- సేవాభావాన్ని ఆచరణలో చూపిస్తున్న డాక్టర్ ప్రవీణ్

మిగతా 4వ పేజీలో..

## అల్లు కనకరత్నంకు
# నివాళులు



**వేద న్యూస్, హైదరాబాద్:**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ.రామారావు,రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రులు గంగుల కమలాకర్,గుంటకండ్ల జగదీష్ రెడ్డిలు స్వర్గీయ అల్లు కనకరత్నం చిత్రపటానికి పూలుజల్లి ఘనంగా నివాళులర్పించారు.సుప్రసిద్ధ హాస్య నటుడు దివంగత అల్లు రామలింగయ్య సతీమణి, మెగాస్టార్ చిరంజీవి అత్త,ప్రముఖ నిర్మాత అరవింద్ మాతృమూర్తి కనకరత్నం ఆగస్ట్ 30వతేదీన మృతి చెందగా,దిశదిన కర్మకాండ జూబ్లీహిల్స్ జేఆర్సీ కన్వెన్షన్ హాలులో సోమవారం జరిగింది.ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ కార్యనిర్వహక అధ్యక్షులు కేటీఆర్, ఎంపీ రవిచంద్ర, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు కమలాకర్, జగదీష్ రెడ్డిలు హాజరై ఆమె చిత్రపటానికి పూలుజల్లి శ్రద్ధాంజలి ఘటించారు.దివంగత కనకరత్నం కుమారుడు అరవింద్,మనవళ్లు అర్జున్, శిరీష్ తదితర కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## 'ఆదిత్య' ఆస్పత్రిపై
# వ్యక్తి దాడి

- ఈసీజీ మిషన్, హాస్పిటల్ ఫర్నీచర్, ప్లెక్సీ ధ్వంసం
- డ్యూటీ డాక్టర్, సిబ్బందిపై దూషణలు, బెదిరింపు

మిగతా 4వ పేజీలో..

## 'ఏ.జే' రౌడీ షీటర్లకు
# స్వేచ్ఛ..!?



- నిమర్జనం వేళ బైండోవర్ ఎందుకు చేయలేదనే ప్రశ్నలు..?
- దసరాకి ఇలాగే స్వేచ్ఛ ఇస్తే ఇక హత్యలే..!
- రౌడీ షీటర్స్ -68,డీసీ- 2, సస్పెక్ట్స్ -150 కి పైగానే ఏ.జే మిల్స్ కాలనీ పరిధిలో ..
- ఇందులో కొంతమందిపై ప్రేమేందుకో..?

**వేద న్యూస్, వరంగల్ క్రైమ్:**

"అరేయ్ నేను ఎవరో తెలుసు కదా..నా వెనుక ఎవరు ఉన్నారో తెలుసు కదా.. నన్ను టచ్ చేస్తే తలలు లేస్తాయి..ఆల్రెడీ మర్డర్ చేసి దర్జాగా తిరుగుతున్న.. చూస్తున్నావు కదా..నా మీద ఎవడైనా ఫిర్యాదు చేసినా ఎవ్వడు ఏమీ చేయలేడు..పోలీస్ లకు కట్ట (పైసల) పడేస్తా. బయటికి వస్తా..వచ్చాక రప్పా రప్పే.." అంటూ ఏ.జే మిల్స్ కాలనీ పరిధిలోని కొంతమంది రౌడీ షీటర్లు నిమర్జనం వేళ మూడు చోట్ల మూడు గ్యాంగులు రచ్చ చేసి వాహనదారులతో, డీజే, డప్పులతో చిల్లర గొడవ పెట్టుకుంటూ.. రచ్చ చేసి దాడులు చేసినట్లు తెలుస్తోంది. ఇలాగే వదిలేస్తే దసరా సమయంలో శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఏ.జే మిల్స్ కాలనీ పీఎస్ పరిధిలో మొత్తం రౌడీ షీటర్స్ 68 మంది, డీసీ ఇద్దరు, సస్పెక్ట్స్ 150 కి పైగానే ఉన్నట్లు తెలుస్తోంది. అయితే, ఇందులో కొందరికి పోలీసులు విపరీతమైన స్వేచ్ఛ ఇవ్వడం వల్ల ఇష్టానుసారంగా ప్రజలను వివిధ రకాలుగా



భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు సమాచారం. స్టేషన్ లో రౌడీ షీటర్లకు నిర్వహించే కౌన్సెలింగ్ కి సైతం కొంతమంది రాజకీయ నాయకుల అండదండలతో అటెండ్ కాకుండా ఉంటున్నట్లు విశ్వసనీయ సమాచారం. కాగా, పోలీసులు నిత్యం యాక్టివ్ గా ఉన్న రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తూ.. నిఘా పెంచి కంట్రోల్ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.

వేద న్యూస్

మంగళవారం సెప్టెంబర్ 09, 2025

# ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ పై అవగాహన

**వేద న్యూస్, కేయూ :**

కాకతీయ విశ్వవిద్యాలయ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ సెల్ (ఐపీఆర్) ఆద్వర్యంలో మంగళవారం ఉదయం 11.00 గంటలకు పరిపాలన భవన ప్రాంగణంలోని సెనెట్ హాల్ లో "ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ పై రెండవ అవగాహన" కార్యక్రమం నిర్వహిస్తునట్టు విశ్వవిద్యాలయ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ సెల్ నోడల్ ఆఫీసర్ ఆచార్య ఎన్. ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి వైస్ ఛాన్సలర్ ఆచార్య కే.ప్రతాప్ రెడ్డి ముఖ్యాతిథిగా, రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం గౌరవ అతిదిగా హాజరవుతారని, హైదరాబాద్ ఐ.ఐ.సి.టి. సీనియర్ సైంటిస్ట్ లు డాక్టర్ సంజిబ్ పాల్, డాక్టర్ గుర్రపు రాజు విస్తృత ఉపన్యాసం చేస్తారని డాక్టర్ ప్రసాద్ వెల్లడించారు. ఈకార్యక్రమానికి బోధనా సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు హాజరు కావాలని కోరారు.

### కాశీబుగ్గలో క్షుద్రపూజల

# కలకలం..



**వేద న్యూస్, కాశీబుగ్గ:**

గ్రేటర్ వరంగల్ కాశీబుగ్గ 19వ డివిజన్ లో గుర్తు తెలియని వ్యక్తులు చేసిన క్షుద్రపూజలు కలకలం రేపుతున్నాయి. దీంతో అక్కడి ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. ఇందిరా నగర్ కాలనీలోని ఆదివారం రాత్రి కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు క్షుద్ర పూజలు నిర్వహించినట్లు స్థానికులు తెలిపారు.ఆదివారం రాత్రి 12 గంటలకు గ్రహణం పట్టే సమయం కావటం వలన మూడు బాటలు కలిసే రోడ్డులో స్థానికుల ఇంటిముందు రంగు ముగ్గులు, పసుపు కుంకుమ, నల్లటి అన్నం,నల్ల కోళ్ళు రోడ్డు పక్కల కనిపించేసరికి స్థానికులు భయాందోళనలు చెందుతున్నారు. ఆ కాలనీలో క్షుద్ర పూజలు చేసినట్టు స్పష్టంగా కనిపిస్తున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని వాపోయారు.ఇలా కాలనీకి వెళ్లే దారిలో క్షుద్ర పూజలు చేయడంపై పలు అనుమానాలు వ్యక్తం చేశారు. తరచూ ఇదే ప్రదేశంలో క్షుద్ర పూజలు జరుగుతున్న అధికారులు పట్టించుకోవడంలేదని స్థానిక కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# బతుకమ్మ ఘాటు పరిశీలించిన ఎంపీడీఓ



వేద న్యూస్, గంగాధర :

గంగాధర మార్కెట్ యార్డులో నిర్మాణంలో ఉన్న బతుకమ్మ ఘాటును సోమవారం ఎంపీడీవో దమ్మని రాము సందర్శించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో మాట్లాడిన ఆయన, పనులను తక్షణం పూర్తి చేసి ప్రజల సౌకర్యార్థం అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. పూర్తి చేసిన తర్వాత ఈ ఘాటు బతుకమ్మ పండుగ సమయంలో మహిళలకు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలకు అనువైన సుందరమైన కేంద్రంగా మారుతుందని తెలిపారు. ఈ సందర్శనలో మండల పంచాయతీ అధికారి గౌరి రమేష్, హౌసింగ్ ఏఈ యశ్వంత్, పంచాయతీ కార్యదర్శులు జిల్లెల్ల లచ్చయ్య, శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# తాత్కాలిక మరమ్మతులు

**వేద న్యూస్,బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రం నుండి కోదురుపాక వెళ్లే ప్రధాన రహదారి దేశాయిపల్లి గ్రామం లోని వరద కాలువ వద్ద ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డు దెబ్బతినటంతో చొప్ప దండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం, ఆదేశాల మేరకు గుంతల్లో మట్టి పోయించి తాత్కాలిక మరమ్మతులు చేయడం జరిగింది.చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం, సూచన మేరకు శాశ్వత పరిష్కారం దిశగా అధికారులు ఇప్పటికే 35 లక్షల బీటి రోడ్డు కు ఎస్టిమేషన్ వేసి టెండర్ల ప్రక్రియ ముగియగానే శాశ్వతంగా రోడ్డు నిర్మాణం చెప్పటటం జరుగుతుంది. అని నాయకులు తెలియజేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో బోయినిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వన్నెల రమణ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎల్లేష్ యాదవ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నిమ్మ వినోద్ రెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కౌడగాని వెంకటేష్, మాజీ సర్పంచ్ మడిశెట్టి జనార్ధన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏమిరెడ్డి సురేందర్ రెడ్డి, కొనుకటి మధుకర్, దిలీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# స్నేహితుని కుటుంబానికి ఆర్థిక చేయూత

**వేద న్యూస్,శాయంపేట :**



శాయంపేట మండల కేంద్రంలోని 1999-2000 పదవ తరగతి బ్యాచ్ కి చెందిన తమ తోటి స్నేహితుడు బాసని చంద్రప్రకాష్ తల్లి బాసని అహల్య అనారోగ్య కారణాల వలన మృతి చెందగా తమ తోటి స్నేహితులు 11,000 రూపాయలను ఖర్చుల నిమిత్తం కుటుంబ సభ్యులకు అంద చేశారు .ఈ కార్యక్రమంలో కందగట్ల సంతోష్ ,మార్త సుమన్, నల్లెల ఈదే%శీ%దర్ ,పోలబోయిన రాజేందర్, మాదారపు సూర్యప్రకాష్, అంకుశావళి, మార్త శ్రీను ,నాలికె బిక్షపతి, బాసని భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# దసరా సెలవులను ప్రకటించిన ప్రభుత్వం

**వేద న్యూస్, హైదరాబాద్:**

తెలంగాణ రాష్ట్రంలో దసరా సెలవులను ప్రభుత్వం ప్రకటించింది. సెప్టెంబర్ 21 నుంచి అక్టోబర్ 3 వరకు అన్నీ పాఠశాలలకు సెలవులు ఉంటాయని వెల్లడించింది. సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 5 వరకు జూనియర్ కాలేజీలకు సెలవులు ప్రకటించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది.

# చివరి మడివరకు సాగునీరు అందిస్తాం

## - ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**వేద న్యూస్,గంగాధర :**



చొప్పదండి నియోజకవర్గం రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం భరోసా ఇచ్చారు. ఈ ఏడాది వర్షపాతం తక్కువగా ఉండటంతో రైతులు సాగు నీటి విషయంలో అనుమానాలు వ్యక్తం చేస్తున్నప్పటికీ, ప్రభుత్వం రైతుల పక్షాన నిలబడి అవసరమైన చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు నుండి గోదావరి జలాలను నారాయణపూర్ రిజర్వాయర్‌కి విడుదల చేసి, అక్కడి నుండి చెరువులను నింపి ప్రతి రైతు పొలానికి సాగునీరు అందేలా చూడాలని సంబంధిత శాఖను కోరినట్లు తెలిపారు. ఈ విషయంపై సీఈ సానుకూలంగా స్పందించారని ఆయన పేర్కొన్నారు. "రైతు సంక్షేమమే మా ముఖ్య ధ్యేయం అని ఒక్క రైతు కూడా ఇబ్బంది పడకుండా నిరంతరం కృషి చేస్తామని చివరి మడివరకు నీరు చేరేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటాం" అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

# రూ.6లక్షల 30 వేలకు లడ్డూను దక్కించుకున్న శ్రీశైలం

**వేద న్యూస్, శేరిలింగంపల్లి :**



శేరిలింగంపల్లి నియోజకవర్గం హాఫిజ్ పేట్ డివిజన్ పరిధిలోని ఓల్డ్ హాఫిజ్ పేట్ గ్రామంలో హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలను 11రోజుల పాటు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.అనంతరం వినాయక నిమజ్జనం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.శనివారం రాత్రి నిర్వహించన లడ్డూ వేలం పాటలో హనుమాన్ యూత్ లడ్డూను కుమ్మరి కైతాపూరం శ్రీశైలం రూ.6 లక్షల 30 వేల రూపాయలకు దక్కించుకుని రికార్డ్ బ్రేక్ సృష్టించారు.ఈ సందర్భంగా హనుమాన్ యూత్ సభ్యులు కుమ్మరి కైతాపూరం శ్రీశైలంని అభినందించి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం వినాయకులను ఊరేగింపు నిర్వహించి కోనేరులో నిమజ్జనం చేశారు.ఈ కార్యక్రమంలో నరేందర్ గౌడ,తలారి వినోద్ ముదిరాజ్, సూర్యం, దేవేందర్ ,రాజు, సంతోష్,సుధాకర్,శివ ఫిష్ వెంకట్, కుమ్మరి రాజు, శేఖర్, ప్రవీణ్, రంజిత్, ఆదిత్య మెడికల్స్ చింటూ,కుమ్మరి వీరేష్,మునిగొండ రవి,విక్రమ్, శేఖర్,రాజు సురేష్,బాలు,రాము,నరేష్ కాంబ్లీ, నాగరాజ్, భరత్, మహేష్, నారాయణ, హనుమాన్ యూత్ సభ్యులు, గ్రామ పెద్దలు,పిల్లలు, మహిళలు భక్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వినతులను సత్వరమే పరిష్కరించాలి

**వేద న్యూస్,వరంగల్:**

ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల ఫిర్యాదులను కలెక్టర్ స్వయంగా స్వీకరించి పరిష్కార నిమిత్తం ఆయా శాఖల అధికారులకు అందజేశారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమానికి 136 ఫిర్యాదులు రాగా, అధికంగా రెవెన్యూ సమస్యలు 60, జిడబ్ల్యూ ఎంసీ 21, విద్యాశాఖ 11, సహకార శాఖ 9, గృహ నిర్మాణ శాఖ 7, వైద్య ఆరోగ్య శాఖ, ఉపాధి కల్పన శాఖలకు 3 చొప్పున, ఇతర శాఖలకు సంబంధించిన 22 ఫిర్యాదులు వచ్చాయి.అర్జీదారుల దరఖాస్తులలో పేర్కొన్న సమస్యలపై క్షుణ్ణంగా పరిశీలించి, మానవతా దృక్పథంతో పరిష్కరించుటకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఫిర్యాదులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఫిర్యాదుదారులకు సమాచారం తెలియజేయాలని సూచించారు.ఈ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్‌లు సంధ్యారాణి, డిఆర్ ఓ విజయలక్ష్మి, జెడ్పి సీఈఓ రామిరెడ్డి, డిఎఓ అనురాధ, డిఎం హెచ్ఓ డాక్టర్ సాంబశివరావు, హౌసింగ్ పీడీ గణపతి, డిసిఓ రాజమణి, ఆర్డీవోలు సత్యపాల్ రెడ్డి, ఉమారాణి, ఆర్సివో అపర్ణ, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసిల్దార్లు, విభాగాల పర్యవేక్షకులు,తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ఏర్పాట్ల పై సమావేశం




**వేద న్యూస్,బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల పరిషత్ కార్యాలయంలో స్థానిక సంస్థల 2వ సాధారణ ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ముఖ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అన్ని రాజకీయ పార్టీల మండల స్థాయి అధ్యక్షులు, కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు. ఓటర్ల తుది జాబితా అలాగే పోలింగ్ స్టేషన్ల జాబితా ప్రకటనకు సంబంధించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే మంగళవారం స్వీకరించనున్నట్లు అధికారులు తెలిపారు. జిల్లా ప్రధాన కార్యనిర్వాహణ అధికారి ఆధ్వర్యంలో అభ్యంతరాలను పరిశీలించి, తుది జాబితాను బుధవారం బోయినిపల్లి మండల పరిషత్ కార్యాలయ నోటీసు బోర్డుపై ప్రచురించనున్నట్లు మండల అభివృద్ధి అధికారి బి. జయశీల తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, నిష్పక్షపాత వైఖరి పాటిస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో అధికారులతో పాటు అన్ని పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఈ నెల 13న జాతీయ మెగాలోక్ అదాలత్

**వేద న్యూస్, వరంగల్ క్రైమ్:**

ఈ నెల 13వ తేదీన జరిగే జాతీయ మెగా లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఈ నెల 13న జాతీయ మెగా లోక్ అదాలత్ ఉన్నందున రాజీ పడదగిన కేసులలో క్రిమినల్ కంపౌండబుల్ కేసులు,సివిల్ తగాదా కేసులు, ఆస్తి విభజన కేసులు, కుటుంబపరమైన కేసులు, వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు, బ్యాంకు రికవరీ, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్,మొదలగు కేసుల్లో కక్షిదారులు రాజీ పడే అవకాశం ఉంటుంది అని పేర్కొన్నారు. రాజీయే రాజ మార్గమన్నారు. చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని, డబ్బులను వృథా చేసుకోవద్దన్నారు. జుడిషియల్ డిపార్ట్మెంట్ ఇచ్చిన అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జిల్లా లోని పోలీస్ అధికారులు, కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుల్ లు మరియు ఇతర పోలీస్ సిబ్బంది రాజీ పడ్డ దగిన కేసులను గుర్తించి ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి రాజీ పడేటట్లు అవగాహన కల్పించడం జరుగుతుంది. కావున ఎవరైనా




తమ కేసులలో రాజీ కావాలి అనుకున్నవారు పోలీస్ అధికారులకు సంప్రదించాలని, లోక్ అదాలత్ ద్వారా బాధితులకు సత్వరమే న్యాయం జరుగుతుంది అని పోలీస్ కమిషనర్ తెలిపారు.

# ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేత

**వేద న్యూస్, గంగాధర :**



గంగాధర మండలం మధురానగర్‌లోని మైనార్టీ గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కార ప్రధానోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఎంపికైన 22 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. ఉపాధ్యాయులు నిబద్ధతతో పనిచేస్తేనే విద్యార్థుల బంగారు భవిష్యత్తు సాధ్యమవుతుందని సూచించారు. అలాగే రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు కల్పిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. నియోజకవర్గంలోని ప్రతి పాఠశాలలో మౌలిక సదుపాయాలను మెరుగుపరచేందుకు తాను కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఏనుగు ప్రభాకర్‌రావు, పలువురు ఉపాధ్యాయులు, గురుకుల పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# టీబీ ముక్త్ భారత్ లక్ష్యం

**వేద న్యూస్, హుజూర్ నగర్:**



టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా హుజూర్నగర్ సిపిఎం ఆఫీస్ ఆవరణలో చాతి ఎక్సరే శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్ నాయక్ మాట్లాడుతూ క్షయవ్యాధి త్వరగా గుర్తించి చికిత్స ప్రారంభించడం, 2025 నాటికి దేశం మొత్తాన్ని క్షయవ్యాధి రహితంగా మార్చడం టీబీ ముక్త్ భారత్ లక్ష్యమని తెలియజేశారు. రెండు వారాలకు మించి దగ్గు, బరువు కోల్పోవడం, తేమడలో రక్తజీరలు, రాత్రి వేళల్లో జ్వరం ఉన్నట్లయితే టీబీగా అనుమానించి వెంటనే పరీక్ష చేయించుకోవాల్సిందిగా కోరారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా టీబీ పరీక్షలు నిర్వహించి మందులు అందించడం జరుగుతుందని తెలిపారు. ఎక్సరే శిబిరంలో 115 మందికి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పద్మ, పబ్లిక్ హెల్త్ నర్సింగ్ ఆఫీసర్ నూర్జహాన్ బేగం, టీబీ కోఆర్డినేటర్ ప్రసాద్, మాధవరెడ్డి,ఆరోగ్య కార్యకర్తలు ఇందిరాల రామకృష్ణ, ఉదయగిరి శ్రీనివాస్, విజయ శ్రీ, ట్రీట్మెంట్ సూపర్వైజర్ మమత, మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# 17 నుండి స్వాస్థ్ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమం

**వేద న్యూస్,హన్మకొండ:**

మహిళల ఆరోగ్యమే లక్ష్యంగా ఈనెల 17 నుండి అక్టోబర్ 2వ తేదీ వరకు స్వాస్థ్ నారీ, సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో స్వాస్థ్ నారీ, సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం విజయవంతంగా అమలు చేయడంపై వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆదేశాలతో మహిళలకు అన్ని రకాల వైద్య పరీక్షలు చేసేందుకు

ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు శిబిరాలు నిర్వహించేందుకు 'స్వాస్థ్ నారీ', సశాక్థ్ పరివార్ అభియాన్' కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్రంలోని మహిళలకు పక్షం రోజుల పాటు నిర్దేశించిన ఆసుపత్రులలో స్పెషలిస్ట్ వైద్యులచే అన్ని రకాల వైద్య పరీక్షలు చేసేందుకు ఏర్పాటు చేయించడం జరుగుతుందన్నారు. అధిక రక్తపోటు, మధుమేహం, ఓరల్ క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్ పరీక్షలు , బ్లడ్ డొనేషన్ క్యాంపులు నిర్వహించడం జరుగుతుందన్నారు. రక్తహీనతకు గురి కాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై యుక్త వయస్సు అమ్మాయిలకు, మహిళలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిం చాలన్నారు. అన్ని పాఠశాలలు, గురుకులాలు, కళాశాలలో విద్యార్థినులకు అనీమియా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. 15 రోజులపాటు నిర్వహించే కార్యక్రమాలపై మహిళలకు తెలియజేయాలని, ఇందుకు విస్తృత ప్రచారం నిర్వహించాల న్నారు. జిల్లాలో షెడ్యూల్ ప్రకారం వైద్య శిబిరాలు నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ,స్పెషలిస్ట్ వైద్యులను సమీకరించుకొని ప్రైవేటు డాక్టర్ల అసోసియేషన్ ల సహకారంతో ఈ వైద్య శిబిరాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. మహిళల ఆరోగ్యమే లక్ష్యంగా నిర్వహించే ఈ కార్యక్రమాలకు వివిధ ప్రభుత్వ విభాగాలు తమ యొక్క సహకారం అందించాలని కోరారు.



ఈ సమావేశంలో జిల్లా పరిషత్ ఇన్చార్జి సీఈవో రవి, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రమాకాంత్, జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి, జిల్లా సంక్షేమ అధికారి జయంతి, సోషల్ వెల్ఫేర్ జిల్లా అధికారి నిర్మల, గిరిజన, బీసీ సంక్షేమ శాఖ అధికారులు ప్రేమకళ, లక్ష్మణ్, ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ గౌతమ్ చౌహాన్, జీఎంహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి, గైనక్లాజిస్టుల సంఘం అధ్యక్షులు డాక్టర్ శ్రీ లక్ష్మి, అడిషనల్ డీఎంహెచ్వో డాక్టర్ మదన్ మోహన్ రావు, డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ విజయకుమార్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ మహేందర్, టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ హిమబిందు , డాక్టర్ జ్ఞానేశ్వర్తదితరులు పాల్గొన్నారు.

# 9న మండల స్థాయి కళా ఉత్సవ పోటీలు



**వేద న్యూస్, ధర్మసాగర్:**

ధర్మసాగర్ మండల స్థాయి కళా ఉత్సవం 9 సెప్టెంబర్ మంగళవారం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలోని టీచింగ్ లెర్నింగ్ సెంటర్ భవనంలో ఉదయం 9:30 గంటల నుండి నిర్వహించనున్నారు. మండలంలోని అన్ని జిల్లా పరిషత్ ,ప్రభుత్వ రెసిడెన్షియల్, కస్తూరిబా గాంధీ విద్యాలయం, ప్రైవేటు యాజమాన్య పాఠశాలల్లో మరియు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న 9 నుండి 12వ తరగతి విద్యార్థులు ఈ కళా ఉత్సవంలో పాల్గొనుటకు అర్హులు అని ధర్మసాగర్ మండల విద్యాధికారి డాక్టర్ రామ్ధన్ తెలియజేశారు. మ్యూజిక్ సోలో, గ్రూప్ ఇన్స్ట్రుమెంటల్ మ్యూజిక్ సోలో, గ్రూప్ నృత్యం సోలో గ్రూప్ ,విజువల్ ఆర్ట్స్ సోలో గ్రూప్, కథలు చెప్పడం సాంప్రదాయక కథలు చెప్పడం అను అంశాలలో పోటీలను నిర్వహించి ,ఉత్తమమైన వాటిని జిల్లా స్థాయికి ఎంపిక చేస్తారని డాక్టర్ రామ్ధన్ తెలియజేశారు. అలాగే ధర్మసాగర్ మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు ప్రాథమిక ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు చదరంగం పోటీలు ఇదే ప్రాంగణంలోని సెమినార్ హాల్లో నిర్వహిస్తారని చెస్ పోటీల నిర్వహణ బాధ్యులు, అయితా శ్రీనివాస్ తెలియజేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరిగిన సన్నాహక సమావేశంలో డాక్టర్ రామ్ధన్ పాల్గొని ఈ విషయాలు తెలియజేశారు.

# నేత్ర దాతలకు సన్మానం

**వేద న్యూస్, ముచ్చర్ల :**

జాతీయ నేత్ర దాన పక్షోత్సవాలలో భాగంగా ముచర్ల గ్రామంలో తెలంగాణ నేత్ర అవయవ, శరీర దాతల అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, వరంగల్ ప్రాంతీయ నేత్ర వైద్య శాల సూపరిండెంట్ డాక్టర్ భరత్ కుమార్,1వ డివిజన్ కార్పొరేటర్ వరంగంటి అరుణకుమారి, ప్రొఫెసర్ డాక్టర్ హరిదేవరాజ్, అసోసియేషన్ ప్రతినిధులు, గ్రామ ప్రజలతో నేత్ర దాన అవగాహన నిమిత్తం నినాదాలతో ఉదయం 9 నుండి 10 గంటలకు వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని 56 మంది నేత్రదాతల కుటుంబ సభ్యులకు శాలువాతో సత్కరించి, అభినందనలపత్రం ఇచ్చి ధన్యవాదములు తెలిపారన్నారు. నేత్ర, శరీర దానం పట్ల అందరూ అవగాహన కల్గియుండాలని, ముచర్ల గ్రామ ప్రజలను రాష్ట్రం లోని అన్ని గ్రామాలు ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో




అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఉపేందర్ రెడ్డి, బోగి సుజాత, పద్మ, రవీందర్, కోన్ రెడ్డి మల్లారెడ్డి, కె నర్సింరాములు, జనార్దన్ రెడ్డి, కేదారి, రాజమణి, సాయిరెడ్డి, యోగా మాస్టర్ భాస్కర్, సాంబయ్య లెక్చరర్, వీరా స్వామి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మోడల్ స్కూల్ విద్యార్థికి గోల్డ్ మెడల్

**వేద న్యూస్, కమలాపూర్ :**



హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రం లోని పీఎం శ్రీ తెలంగాణ మోడల్ స్కూల్ కు చెందిన పదవ తరగతి విద్యార్థి నక్క సమన్విత్ సెప్టెంబర్ 5వ తేదీ నుండి 9వ తేదీ వరకు నిర్మల్ పట్టణంలో జరిగిన రాష్ట్రస్థాయి యోగాసనా ఛాంపియన్ షిప్ ఫార్వర్డ్ బెండ్ విభాగంలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి గోల్డ్ మెడల్ సాధించాడు. అంతేకాకుండా విజయవాడలో జరిగే జాతీయస్థాయి యోగాసనా పోటీలకు కూడా ఎంపికయ్యాడు. దీంతో పాఠశాల ప్రిన్సిపాల్ డా. జి అనిత, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు అంతా తమ పాఠశాలకు చెందిన విద్యార్థికి యోగాసనా పోటీలలో గోల్డ్ మెడల్ రావడం పట్ల సంతోషం వ్యక్తం చేసి గోల్డ్ మెడల్ సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకొచ్చినటువంటి నక్క సమన్విత్ ను అభినందించారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు పిఈడి రాజు పర్యవేక్షణలో మరింతగా శ్రమించి జాతీయ స్థాయిలో కూడా మెరుగైన ప్రదర్శన ఇచ్చి మరింత ముందుకు వెళ్లాలని వారు ఆకాంక్షించారు. నక్క సమన్విత్ రాష్ట్రస్థాయి యోగాసనా పోటీలలో గోల్డ్ మెడల్ సాధించడం పట్ల అతని తల్లిదండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ, భవిష్యత్తులో ఇదేవిధంగా ఉన్నతంగా ఎదుగుతూ తల్లిదండ్రులకు, పుట్టిన గ్రామానికి గొప్పగా పేరు తీసుకురావాలని గ్రామస్తులు కాంక్షించారు.

# రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

**వేద న్యూస్, కాజీపేట :**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు అండగా నిలిచి భీమా మొత్తాన్ని పెంచినందుకు గాను భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దరిపెల్లి చంద్రమన్న పిలుపుమేరకు కాజీపేట డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో కాజీపేట స్వామి వివేకానంద గృహ నిర్మాణ కార్మిక సంఘం కార్మికులు అందరూ కలిసి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి చిత్రపటాలకు కాజీపేట చౌరస్తా నందు సోమవారం పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్మికులకు అండగా నిలిచి సాధారణ మరణానికి ఒక లక్ష నుండి రెండు లక్షల వరకు, ప్రమాదవశాత్తు మరణించిన కార్మికులకు ఆరు లక్షల నుండి పది లక్షల వరకు పెంచినందుకు కార్మికుల పక్షాన కృతజ్ఞతలు తెలియజేస్తు పాలాభిషేకం నిర్వహించడం జరిగిందన్నారు. అలాగే కార్మికుల మరికొన్ని సమస్యలు అయిన కార్మికుల కుటుంబంలో ఇద్దరు ఆడపిల్లలకు వారి పెండ్లి రీత్యా, ప్రసవించిన 30000 లను లక్ష రూపాయలకు పెంచాలని, 50 సంవత్సరాలు నిండిన కార్మికులకు 5000 పెన్షన్స్, ఈఎస్ఐ సౌకర్యము, లేబర్ కార్డు కార్మికుని జీవితకాలము ఉపయోగపడే విధంగా ఉండాలని గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరులో స్థానిక మేస్త్రీలకే ఇండ్లు కట్టుటకు అవకాశం కల్పించాలని, ఇల్లు లేని కార్మికులకు ఇల్లు నిర్మాణం చేయించి ఇవ్వాలనీ, సెంట్రింగ్ పని చేస్తున్న కార్మికులకు 10 లక్షల రూపాయలు ఇచ్చి వారికి బతుకుదెరువు చూపాలని, గత ప్రభుత్వంలో బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి ఒక కార్మికునికి మోటార్ సైకిల్ పంపిణీ చేస్తానని చెప్పి మోసం చేసిందని, ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వము కార్మికులకు మోటార్ సైకిల్ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో స్వామి వివేకానంద గృహ నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు కుంచం ఐలయ్య, ప్రధాన కార్యదర్శి అశోక్, గండు సత్యం, గడ్డం రాజు, తాళ్ల వీరస్వామి, మంద బాబు, రమణ, కుంచాల శ్రీను, భరత్, గుండె ప్రభాకర్ , స్వామి, భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం కార్మికులు పాల్గొన్నారు.




# జై గౌడ నూతన కమిటీ ఎన్నిక

**వేద న్యూస్, హుజూర్ నగర్**



:సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ పట్టణంలో జై గౌడ్ ఉద్యమ జాతీయ అధ్యక్షులు వట్టికూటి రామారావు గౌడ్ ఆదేశాల మేరకు సోమవారం హుజూర్నగర్ లో శ్రీశ్రీశ్రీ కంఠమహేశ్వర స్వామి సురమాంబ తల్లి గుడిలో సూర్యాపేట జిల్లా ఉపాధ్యక్షులు కేశగాని నాగేశ్వరరావు గౌడ్, ఆధ్వర్యంలో సోమగాని నరసింహ గౌడ్ అధ్యక్షతన నూతన జై గౌడ కమిటీని నిర్ణయించడం జరిగింది. జై గౌడ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కొండ హరీష్ గౌడ్, హుజూర్నగర్ జై గౌడ పట్టణ అధ్యక్షులు వల్లదాసు నాగరాజు గౌడ్, జై గౌడ పట్టణ ప్రధాన కార్యదర్శి సోమగాని మహేష్ గౌడ్ నీ,నియమించడం జరిగింది.

వేద న్యూస్

మంగళవారం సెప్టెంబర్ 09, 2025

# ఉపాధ్యాయుడే మార్గదర్శకుడు

**- విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోంది - ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**




**వేద న్యూస్, చొప్పదండి/ గంగాధర :**

విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది, వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయడంలో ఉపాధ్యాయులది కీలక పాత్ర అని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గంగాధర మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో సోమవారం మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కార ప్రధానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మండల స్థాయిలో ఎంపికైన 22 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందజేయడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కృషి చేస్తుందన్నారు. నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాల కల్పనకు కృషి చేస్తామన్నారు. ఉపాధ్యాయులు చిత్తశుద్ధితో పనిచేసే విద్యార్థుల భవిష్యత్తుకు పునాదులు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఏనుగు ప్రభాకర్ రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ప్రగతికి నిబద్ధతతో కృషి చేయాలి

**వేద న్యూస్, హైదరాబాద్:**



కళాశాల విద్యార్థుల ప్రగతి లక్ష్యంగా నిరంతరం అంకితభావంతో, నిబద్ధతతో కృషి చేసిన సిటీ కళాశాల తెలుగు అసోసియేట్ ప్రొఫెసర్, ఐక్యూయేసి కో ఆర్డినేటర్ డా.జె.నీరజ, బయో కెమిస్ట్రీ అధ్యాపకులు సుమన యాదగిరి ఆదర్శ అధ్యాపకులని వైస్ ప్రిన్సిపాల్ డా. విప్లవ దత్ శుక్లా అన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ అధ్యాపక పురస్కారం అందుకున్న డా.నీరజ, సుమన యాదగిరిలను కాలేజి స్టాఫ్ క్లబ్ పక్షాన ఘనంగా సన్మానించారు. ఈ అభినందన సభలో వైస్ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థుల ప్రగతికి విశేషంగా కృషి చేసిన అందరూ ఉత్తమ అధ్యాపకులేనని అన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డా.శాంతి మాట్లాడుతూ డా.నీరజ కళాశాల సర్వతోముఖ ప్రగతికి అనుక్షణం పరిశ్రమించారని అన్నారు. సుమన యాదగిరి బోధనలో, పరిశోధనలో కృషి చేశారని, క్లస్టర్ కాలేజి సమన్వయ కర్తగా అనేక కార్యక్రమాలను నిర్వహించటమే కాక, వివిధ పోటీలలో విద్యార్థులు పాల్గొనేలా ప్రోత్సహించారన్నారు. తెలుగు శాఖ అధ్యక్షులు డా.కోయి కోటేశ్వర రావు మాట్లాడుతూ సిటీ కళాశాలకు అత్యున్నతమైన గ్రేడ్ తీసుకురావడంలో ఐక్యూయేసి కో- ఆర్డినేటర్ గా డా.నీరజ కీలకమైన పాత్ర పోషించారనీ, తెలుగు అధ్యాపకురాలుగా విద్యా విషయక అధికారిగా, పరిశోధకురాలిగా, విమర్శకులుగా బహుముఖీన సేవలందించారని అన్నారు. ఈ అభినందన సభకు తెలుగు శాఖ సహాయ ఆచార్యులు అవధానం సుజాత అధ్యక్షత వహించగా స్టాఫ్ క్లబ్ అధ్యక్షులు డా.శంకర్, డా.మల్లి కార్జున్ , బిసి వెల్ఫేర్ కో-ఆర్డినేటర్ బాలకృష్ణ, డా.భాస్కర్ బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

# రామాలయ కమిటీ చైర్మన్‌కు భాస్కర్ సన్మానం



**వేద న్యూస్, ఇల్లందకుంట:**

అపర భద్రాద్రి ఇల్లందకుంట సీతా రామచంద్ర స్వామి దేవాలయ కమిటీ చైర్మన్ ఇంగిలే రామారావును తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి కరీంనగర్ జిల్లా, హన్మకొండ జిల్లా అధ్యక్షుడు హింగే భాస్కర్..శాలువాతో ఘనంగా సత్కరించారు. స్వామి వారి ఆలయ కమిటీ చైర్మన్ గా రామారావు చక్కటి సేవలు అందిస్తున్నారని భాస్కర్ పేర్కొన్నారు. సోమవారం ఆలయ ప్రాంగణంలో రామారావును భాస్కర్, నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వరికెల కిషన్ రావు, హన్మకొండ ఆర్ ఎంపీల జిల్లా అధ్యక్షులు నాగుర్ల సంతోష్, హింగే రవీందర్ ,నాగుర్ల చిన్న వీరన్న, లోనే సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆవాసంలో చక్కటి బోధన

**- సూక్ష్మదర్శిలో మందార పుప్పొడి రేణువుల పరిశీలన**

**వేద న్యూస్, జమ్మికుంట:**



జమ్మికుంట పట్టణంలోని కేశవపురం శ్రీవిద్యారణ్య ఆవాసంలో విద్యార్థినీ విద్యార్థులకు ఆచార్యులు ఆంగ్ల మాధ్యమంలో చక్కగా బోదిస్తున్నారు. సబ్జెక్ట్‌లోని విషయాలను విపులంగా వివరించేందుకు ప్రత్యక్ష బోధనా పద్ధతులను అనుసరిస్తూ.. అర్థం చేయిస్తున్నారు. గాలి, వెలుతురు ధారాళంగా ఉండే చక్కటి ఆహ్లాదకరమైన తరగతి గదులలో, ప్రయోగశాలలో విషయాలను వివరిస్తున్నారు. విశాలమైన క్రీడా ప్రాంగణం పాఠశాల కలిగి ఉండగా, అందులో విద్యార్థులు హాయిగా ఆడుకోవచ్చు. సోమవారం పాఠశాలలోని 8వ తరగతి చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు సూక్ష్మదర్శి ద్వారా మందార పువ్వు పుప్పొడి రేణువులు(మేల్ గామెట్స్) చూపించారు. ప్రత్యక్ష పరిశీలన ద్వారా విద్యార్థులకు చక్కగా విషయం అర్థమవుతుందని ఉపాధ్యాయులు ఈ సందర్భంగా తెలిపారు.

# స్టూడెంట్స్ క్రీడల్లోనూ రాణించాలి



**- ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు ప్రారంభం**

**వేద న్యూస్, జమ్మికుంట:**

జమ్మికుంట మండల స్థాయి ఎస్ జి ఎఫ్ క్రీడలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిస్టిక్ ఎస్ జిఎఫ్ సెక్రటరీ వేణుగోపాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని అన్నారు. క్రీడలతో అనేక ప్రయోజనాలు ఉంటాయని చెప్పారు. కార్యక్రమానికి సభాధ్యక్షులుగా వ్యవహరించిన ఎంఈఓ హేమలత ఆధ్వర్యంలో జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. మండలంలోని వివిధ పాఠశాల నుండి బాలికలు అండర్ 14 , 17 విభాగాలలో కబడ్డీ, ఖో ఖో, వాలీబాల్ క్రీడలలో పాల్గొన్నారు. గెలుపొందిన జట్లను జిల్లా స్థాయికి ఎంపిక చేసినట్టు మండల ఎస్ జి ఎఫ్ సెక్రెటరీ శ్రీలత తెలిపారు. కార్యక్రమంలో పీడీ శ్రీనివాస్, ప్రేమలత, వివిధ పాఠశాలల పి టి లు పాల్గొన్నారు

# 'ఆదిత్య' ఆస్పత్రిపై వ్యక్తి దాడి

- **ఈసీజీ మిషన్, హాస్పిటల్ ఫర్నీచర్, ఫ్లెక్సీ ధ్వంసం**
- **డ్యూటీ డాక్టర్, సిబ్బందిపై దూషణలు, బెదిరింపు**
- **రూ.2 లక్షల వరకు నష్టం జరిగిందని యాజమాన్యం ఫిర్యాదు**
- **వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు**




**వేద న్యూస్, జమ్మికుంట:**

జమ్మికుంట పట్టణంలోని కాకతీయ స్కూల్ పక్కన ఉన్న ఆదిత్య మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిపై ఓ వ్యక్తి దాడి చేసి ఫర్నీచర్ ధ్వంసం చేసి, వైద్యుడు, సిబ్బందిని దూషించారు. జమ్మికుంట టౌన్ సీఐ రామకృష్ణగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. జగ్గయ్యపల్లికి చెందిన బొమ్మిడేని సాయి చేతికి గాయం కాగా, ఆదివారం ఆయన ట్రీట్‌మెంట్ నిమిత్తం ఆదిత్య మల్టీస్పెషాలిటీ ఆస్పత్రికి వచ్చారు. ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్న క్రమంలో సుమారు 9 గంటల సమయంలో బొమ్మిడేని సాయి సోదరుడు బొమ్మిడేని అజయ్ సదరు హాస్పిటల్ లోపలికి వచ్చారు. కోపంగా 'ఎవడ్రా నా తమ్ముని కొట్టింది..' అంటూ హాస్పిటల్‌లోని ఈసీజీ మిషన్‌ను, హాస్పిటల్‌లోని ఫర్నీచర్‌ను, హాస్పిటల్ ముందు గల ఫ్లెక్సీని ధ్వంసం చేసి.. డ్యూటీ డాక్టర్, సిబ్బందిని నానా బూతులు తిట్టి బెదిరించారు. తమకు దాదాపుగా రూ.2 లక్షల వరకు నష్టం కలిగిందని ఆదిత్య మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి మేనేజింగ్ పార్ట్‌నర్ ఎలుక దేవేందర్‌రెడ్డి ఈ మేరకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

# ఐఎఫ్‌డబ్ల్యూజే జాతీయ సమావేశాలు

**వేద న్యూస్, హుజురాబాద్:**

జర్నలిస్టుల ఉద్యమంలో 75 ఏళ్ల చరిత్ర కలిగిన ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఐఎఫ్ డబ్ల్యూజే) జాతీయ సమావేశాలు ఈ నెల 11, 12, 13 తేదీలలో రాజస్థాన్ లోని జోధ్ పూర్ లో జరుగుతాయని ఫెడరేషన్ జాతీయ కౌన్సిల్ సభ్యులు, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) కరీంనగర్ జిల్లా కార్యదర్శి కుడుతాడు బాపురావు తెలిపారు. సూర్య నగరంగా ప్రసిద్దిగాంచిన జోధ్ పూర్ నగరంలో తొలిసారిగా జరుగుతున్న ఈ మూడు రోజుల జాతీయ సమావేశాలకు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన 500 మంది ప్రతినిధులు హాజరవుతారని సోమవారం ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. జోధ్ పూర్ లోని మహేశ్వరి భవన్ (ఐఎఫ్ డబ్ల్యూజే జాతీయ అధ్యక్షుడు దివంగత డాక్టర్ కె.విక్రమ్ రావు స్మారక హాల్) లో 11వ తేదీన రాజస్థాన్ కళా బృందాల సాంస్కృతిక ప్రదర్శనల స్వాగతంతో ఈ సమావేశాలు ప్రారంభమవుతాయని అన్నారు. ప్రారంభ సమావేశాల్లో పలువురు కేంద్ర,రాష్ట్ర మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశాల్లో భాగంగా "డిజిటల్ యుగంలో జర్నలిజం-మారుతున్న పరిస్థితులు-సవాళ్ళు"అన్న అంశంతో పాటు, "బ్లాక్ మెయిలింగ్-ఎల్లో జర్నలిజం-తీవ్రమైన ఆందోళన", "జర్నలిస్టుల రక్షణ-మీడియా యాజమాన్యాలు, ప్రభుత్వాల పాత్ర", "జర్నలిస్టుల విశ్వసనీయత-పత్రికల సామాజిక బాధ్యత" తదితర అంశాలపై ప్రముఖ సీనియర్ పాత్రికేయులు ప్రసంగిస్తారన్నారు. రెండో రోజు మూడో రోజు జరిగే ప్రతినిధుల సమావేశాల్లో దేశం నలుమూలల నుంచి వచ్చే ఐఎఫ్ డబ్ల్యూజే ఆఫీస్ బేరర్లు, కార్యవర్గ, వర్కింగ్ కమిటీ సభ్యులు, జాతీయ కౌన్సిల్ సభ్యులు హాజరవుతారని, ఆయా రాష్ట్రాల జర్నలిస్టుల సమస్యలపై నివేదికలు సమర్పిస్తారని చెప్పారు. జర్నలిస్టుల సంక్షేమం, సమస్యల పై సమావేశాల్లో చర్చించడం జరుగుతుందని, ముఖ్యంగా జర్నలిస్టుల రక్షణ చట్టం, సీనియర్ జర్నలిస్టులకు జాతీయ పెన్షన్ స్కీం, జర్నలిస్టుల వేజ్ బోర్డు, రద్దయిన రైల్వే రాయితీ పాసుల పునరుద్ధరణ తదితర అంశాల పై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తారని తెలిపారు. ఈ జాతీయ సమావేశాలకు తెలంగాణ రాష్ట్రం నుంచి 25 మంది ప్రతినిధులు ఈనెల 9న బయలుదేరి వెళుతున్నట్లు వారు తెలిపారు.

# సేవే ప్రవీణ్ మార్గం

**- శ్రీ కృష్ణపిల్లల ఆస్పత్రిలో చక్కటి వైద్య సేవలు**

**- సేవాభావాన్ని ఆచరణలో చూపిస్తున్న డాక్టర్ ప్రవీణ్**

**వేద న్యూస్, జమ్మికుంట:**



నాడీ పట్టుకుంటే చాలు.. రూ. వందలు, వేలు, లక్షల్లో వసూలు చేస్తున్న రోజులు ఇవి. ఇక నవజాత శిశువులు, పిల్లల ట్రీట్‌మెంట్‌కు అయ్యే ఖర్చు గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. రోగం నిర్ధారణ అయ్యే లోపే అడ్వాన్స్ ఎంట్రీ ఫీజు, ప్యాకేజీలు అంటూ జేబులు గుల్ల చేస్తున్న కొన్ని ఆస్పత్రుల కాలమిది. కానీ, అలాంటి వాతావరణానికి కొంత భిన్నంగా జమ్మికుంట పట్టణంలోని శ్రీకృష్ణ పిల్లల ఆస్పత్రిలో వైద్య సేవలు అందిస్తున్నారు. జమ్మికుంట పట్టణ, మండల, పరిసర ప్రాంత పేద, మధ్యతరగతి, దిగువ మధ్య తరగతి ప్రజలు నవజాత శిశువుల ట్రీట్‌మెంట్ నిమిత్తం సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా జమ్మికుంటలోని శ్రీకృష్ణ పిల్లల ఆస్పత్రిలో చక్కటి వైద్య సేవలందిస్తున్నారు. వైద్య వృత్తిలో ప్రావీణ్యమున్న కన్సల్టెంట్ పీడియాట్రిషన్, నియోనాటలజిస్ట్, ఎంబీబీఎస్ గాంధీ ఆస్పత్రి, ఎండీ పీడియాట్రిక్స్ ఏఎంసీ, పీజీపీఎన్ బోస్టన్ వర్సిటీ, పీఏఎల్ఎస్.. డాక్టర్ జి.ప్రవీణ్.. వృత్తినే దైవంగా భావించి ప్రజలకు సేవలందిస్తున్నారు.

**- ఆస్పత్రిలో అన్ని సౌకర్యాలు**

అత్యాధునిక పరికరాలు అందుబాటులో ఉండటం ఈ ఆస్పత్రి ప్రత్యేకతని చెప్పొచ్చు. చైల్డ్ ఫ్రెండ్లీ ఎన్విరాన్‌మెంట్ ప్లస్ అప్రోచ్‌తో ఆస్పత్రి వైద్యుడు, సిబ్బంది ..పిల్లలకు ట్రీట్‌మెంట్ అందిస్తారని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఆస్పత్రిలో ఓపీకి నవజాత శిశువు లేదా పిల్లలను తీసుకురాగానే డాక్టర్ ప్రవీణ్ తొలుత.. కుటుంబ సభ్యుల నుంచి అనారోగ్య విషయమై పూర్తి వివరాలు తెలుసుకుని..ఆ తర్వాత ట్రీట్‌మెంట్ ప్రారంభించడం మొదలుపెడతారు. పిల్లల ఆరోగ్య సం'రక్షణే' కర్తవ్యంగా వైద్యుడు ప్రవీణ్ సేవలందిస్తున్నారు. చైల్డ్ గ్రోత్, వెల్‌నెస్, వ్యాక్సినేషన్‌తో పాటు నియోనాటల్ కేర్(ఎన్ఐ సీయూ), పీడియాట్రిక్ కేర్(పీఐసీయూ)కు సంబంధించిన అన్ని రకాల సౌకర్యాలు ఆస్పత్రి లో అందుబాటులో ఉండటం విశేషం. సంపూర్ణ ఆరోగ్యంతో నవజాత శిశువు లేదా పిల్లలు ఆస్పత్రి నుంచి తిరిగి వెళ్లేలా ట్రీట్‌మెంట్‌ను శ్రీకృష్ణ ఆస్పత్రిలో అందిస్తున్నారు. జనం తమ పిల్లల ఆరోగ్య విషయమై శ్రీకృష్ణ ఆస్పత్రిని సంప్రదించొచ్చని, హాస్పిటల్‌లో అన్ని రకాల ఫెసిలిటీస్‌తో పాటు అనుభవం, పరిజ్ఞానం, నిపుణత కలిగిన వైద్యుడు, సిబ్బంది 24/7 అందుబాటులో ఉంటారని పలువురు పేర్కొంటున్నారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073